# ప్రాణ స్నేహితుడు నిజాం వెంకటేశం

**– బి ఎస్ రాములు**
సామాజిక తత్వవేత్త
బీసీ కమిషన్ మాజీ చైర్మన్
సెల్: 8331966987

నిజాం వెంకటేశం ప్రాణ స్నేహితుడు
హృదయంలో హృదయమై
ప్రాణంలో ప్రాణమై
జీవితంలో జీవితమై
ఆత్మలో ఆత్మయై
కలిసిమెలిసి జీవితం
నిజాం వెంకటేశం
...
నిజాం వెంకటేశం!
ఇంత అకస్మాత్తుగా
వెళ్లిపోయావేమిటి?
నీ గురించి ఏమని రాయను.
1978లో కలుసుకున్నప్పటినుండి
మన సాహిత్య వ్యాసంగం
మన జీవితాలు
ఎంతగా పెనవేసుకొనిపోయాయి
నువ్వు – నేను వేరనుకున్నామా!
ఎన్ని ఒడుదుడుకులు ఎదుర్కొన్నామో
ఎన్నెన్ని ఆశలు
ఎన్నెన్ని కలలు కన్నాము

ఈ జీవితం మారాలని
ఈ సమాజం మారాలని
దోపిడీ పీడన లేని
అన్యాయాలు, అక్రమాలు లేని
సమసమాజ నిర్మాణం కోసం
మనం ఎన్ని కలలు కన్నాము
ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నాము
నీకు తెలుసు – నాకు తెలుసు.
ఆ ఉద్యమానికి తెలుసు.
ఆనాటి చరిత్ర కాలానికి తెలుసు
ఒకటా రెండా!
నువ్వు ఎన్ని రంగాల్లో కృషి చేశావు.
ఏమని చెప్పను?
సాహితీవేత్తలకు
అన్నివిధాలుగా సహకరించావని చెప్పనా!
ఆర్థికంగా ఆదుకున్నావని చెప్పనా!
నైతికంగా మద్దతుగా నిలిచాడని చెప్పనా!
సాహిత్యానికి దశాబ్దాలపాటు
ఇంటికి నిట్టాడై నిలిచాడని చెప్పనా!
కొత్త పుస్తకం ఏది వచ్చినా అందరికి
కొని ఇచ్చావని చెప్పనా!
అలిశెట్టి ప్రభాకర్‌కు ఎన్ని చేశావు!
నలిమెల భాస్కర్‌కు బహుభాషా కోవిదుడుగా
ఎంత చేశావు
జూకంటి జగన్నాథం జీవితంలో జీవితమై
ప్రాణంలో ప్రాణమై సాహిత్యకారుడిగా
ఎదిగించావని చెప్పానా!

కరీంనగర్ భోజుడిగా
చేతికి ఎముక లేకుండా
చేయూతనందించావని చెప్పనా!
1977లోనే సిరిసిల్ల తంగల్లపల్లిలో
గద్దర్‌తో సభలు పెట్టావని చెప్పనా!
సృజన సాహితీ మిత్రులకు
చేయూత నందించావని చెప్పనా!
సృజనను పరివ్యాప్తం చేయడంలో
పాలుపంచుకున్నావని చెప్పనా!
మినీ కవితల హోరులో
దీర్ఘకవిత నీలుగుతున్న సమయంలో
దిక్సూచి పత్రికతో
దీర్ఘకవితకు తిరిగి ప్రాణ ప్రతిష్ఠ
చేశావని చెప్పనా!
నా జీవితంలో ఒక దశలో కె. పోచయ్య
ఒక దశలో కె. రామలక్ష్మణ్
ఒక దశలో సిహెచ్‌వి. ప్రభాకర్‌రావు
మరొక దశలో గూడూరి సీతారాం
అన్ని దశల్లో అన్ని కాలాల్లో ప్రాణ స్నేహితుడవై
తోడై నీడై నిలిచావు నిజాం వెంకటేశం!
అల్లం నారాయణ, అల్లం రాజయ్య
బి.ఎస్. రాములు, డా॥ సూర్యప్రకాష్
స్ప్రెడ్డింగ్ లైట్ జ్యోతి, సుద్దాల అశోక తేజ
ఆర్టిస్ట్ చంద్ర, కవి శివారెడ్డి
కవి వరవరరావు, గాండ్ల రవీందర్
కథలాపూర్ గంగారెడ్డి
అందరి జీవితాల్లో భాగమయ్యావని చెప్పనా!

కరీంనగర్ బుక్ ట్రస్ట్ స్థాపించి
అల్లం రాజయ్య కథలు
భూమిక కథల సంపుటిగా
అచ్చు వేశావని చెప్పనా!
బి.ఎస్. రాములు బతుకుపోరు
ముందుకు తెచ్చామని చెప్పనా!
బొగ్గుపొరల్లో అడవిలో వెన్నెల
కథా సంకలనాలు కలిసి తెచ్చామని చెప్పనా!
విశాలసాహితీ నిర్మాణంలో
ప్రచురణలో నువ్వున్నావని చెప్పనా!
నేను ఆరేళ్ళు అడవిబాట పట్టినప్పుడు
ఇంటిల్లిపాదికి ఆలంబనై
నిలిచావని చెప్పనా!
నా పిల్లలకు మేనమామవై
ఆదుకున్నావని చెప్పనా!
దరకమే ఐక్యవేదిక నిర్మాణంలో
కులాతీతంగా కలిసి
పని చేశావని చెప్పనా!
తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో
అంతర్లీనంగా ఎన్ని చేశావో
ఎవరికి తెలుసు.
నాటి తెలంగాణ ఉద్యమంలో
ఎన్ని చేశావో ఎవరికి తెలుసు.
నీకు స్నేహితులు కానివారెవరు?
నీ ఇంట మాధవిచేతులమీదుగా
అన్నం తినని వారెవరు?
నీ ఇంట ఆశ్రయం పొందనివారెవరు?

స్టడీ సర్కిల్ పేరిట ఎన్ని సదస్సులు
పెట్టామో ఎవరికి తెలుసు
పౌరహక్కుల సంఘంలో
బాలగోపాల్ ఎంత ఆసరా అయ్యావో
ఎవరికి తెలుసు.
నిన్నటి యువకులు నేడు
విప్లవకారులుగా మారుతూ
అంతర్ధానమవుతుంటే
ఎన్‌కౌంటర్లకు గురవుతుంటే
ఎవరికీ తెలియకుండా
ఎంత కన్నీరు కార్చామో
ఎవరికి తెలుసు
నీకు – నాకు తెలుసు.
మనవాళ్ళకు తెలుసు.
ఓ నా ప్రాణమా
నా ప్రాణంలో ప్రాణమా.
నా జీవితంలో జీవితమైన
విజ్ఞాన సర్వస్వమా!
నడుస్తున్న గ్రంథాలయమా!
బహుముఖీన ప్రజ్ఞావంతుడా
అమరుడా నిజాం వెంకటేశమా!
అందుకో నా జోహార్లు
అందుకో నా నివాళ్ళు
నా చరిత్రలో నువ్వొక భాగం.
నా హృదయంలో,
నా శరీరంలో భాగమైనవాడా
నిన్నెలా మరువగలను?